క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ మిల్క్‌ప్రాజెక్ట్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా దిగువ తెలియపరిచిన ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సయ్యద్ అప్పలస్వామి కాలేజి వెనుక పక్క కొండ ప్రాంతం, వీజీఎస్ పబ్లిషర్స్, రాజీవ్ శర్మనగర్, లంబాడీపేట, సాయిరాం సినిమా హాల్ ఏరియా, కలరా హాస్పటల్ కొండ ప్రాంతం, కుండల మార్కెట్ ప్రాంతం, సౌమ్య సినిమా హాల్ ప్రాంతంలో కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

వినతిపత్రం అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా సెంటర్ సమీపంలోని సీవీఆర్ ఫ్లై ఓవర్ దిగువన శివశక్తి నగర్ వద్ద ఆర్టీసీ రూట్ బస్‌లతోపాటు సిటీ సర్వీసులను నిలిపేలా రిక్వెస్ట్ స్టాప్ కోసం విద్యాధరపురం ఆర్టీసీ డిపో మేనేజర్ బ్రహ్మేశ్వరరావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో నివసించే వందలాది కుటుంబాలు సిటీ సర్వీస్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన డీఎం బ్రహ్మేశ్వరరావు త్వరలోనే అక్కడ ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రామమూర్తికి నివాళి

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నాటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రాల మాజీ ఎమ్మెల్సీ రావు సాహెబ్ గానాల రామమూర్తి 130వ జయంతిని పురస్కరించుకుని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శనివారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సున్నపు వీరభద్రాచారి, జవ్వాది సుధీర్, చిట్టూరి హరీష్, రమేష్, బీసీ నాయకులు పి.కరీంఖాన్, దుర్వేసుల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద కళావేదికపై శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. మంగళగిరికి చెందిన శ్రీ సరస్వతి సంగీత నృత్య కళాశాలకు చెందిన పలువురు చిన్నారులు శివలీలలు, అఖిలాండేశ్వరి, నవదుర్గా.. ముద్దుగారే యశోదా.. దశావతారం, శివతాండవంపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు దేవస్థాన అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

తాపీమేస్త్రి కనిపించడం లేదని ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తాపీమేస్త్రి కనిపించక పోవడంతో కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ ఉప్పలపాటి రామచంద్రరాజు వీధికి చెందిన పుంగ్రోటి సత్యనారాయణ(53) తాపీమేస్త్రి. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన సత్యనారాయణ అదే రోజు సాయంత్రం 5 గంటల వేళ బయటకు వెళ్లారు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో పరిచయస్తులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. అయినా సత్యనారాయణ జాడ లేకపోవడంతో కుమారుడు విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టు సాధిస్తేనే ఉపాధి అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సమకాలీన మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాలపై పట్టు సాధించినప్పుడే విస్తృతమైన ఉపాధి అవకాశాలు పొందుతారని కేఎల్ యూనివర్సిటీ సీఎస్ఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ జొన్నలగడ్డ సూర్యకిరణ్ అన్నారు. కేబీఎన్ కళాశాల ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'కన్‌టెంపరరీ టెక్నాలజీస్ అండ్ వెరియస్ సర్టిఫికేషన్స్ ఫర్ కెరీర్ అడ్వాన్స్‌మెంట్' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ కంప్యూటర్స్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ వంటి మార్పులు వచ్చాయన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చెయిన్ వంటి రంగాల్లో మరింత నైపుణ్యాల అవసరం పెరిగిందన్నారు. వీటిపై పట్టు సాధించి ప్రతిభకు పదును పెట్టుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ వివిధ రంగాల్లో వస్తున్న మార్పులు తెలియజేయడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, అధ్యాపకులు రవీంద్ర, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సితార సెంటర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మైలవరపు లావణ్య తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్బన్ హెల్త్ సెంటర్లలో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 45వ డివిజన్ 138వ వార్డ్ సచివాలయం పరిధిలో శనివారం ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్యతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి అందుతున్న పథకాలను వివరిస్తూ.. వాటి వివరాలతోకూడిన బ్రోచర్‌ను అందజేస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యలతో పథకాలు అందనివారి వివరాలు తీసుకుని వాటిని సరిచేసి తిరిగి దరఖాస్తు చేయించి అర్హులకు తప్పనిసరిగా పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

గత ప్రభుత్వ హయాంలో వీఎంసీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అరకొర వైద్యం చేసేవారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరపాలక సంస్థ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతోందని వెలంపల్లి తెలిపారు. దీంతో వైద్య రంగాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి విలేజ్/అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా అన్ని రకాల రోగాలకు నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించి వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఆయా హెల్త్ సెంటర్లలో ల్యాబ్ టెక్నీషియన్స్ ఏర్పాటు చేసి రక్త పరీక్షలు చేస్తున్నారని తెలిపారు.

హాస్పటల్ వద్దకు వచ్చే అవకాశం లేనివారికి టెలీకాన్ఫరెన్స్ ద్వారా కూడా వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. కబేళా ఒకప్పుడు నగర శివార్లలో ఉండేదని, ఇప్పుడు అది నివాసాల మధ్యకు రావడంతో స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య, సచివాలయ కన్వీనర్లు పద్మ, లక్ష్మి, కోటేశ్వరి, సరగడ కృష్ణ, ప్రసాద్, లక్ష్మారెడ్డి, నేతలు మైలవరపు కృష్ణ, బట్టిపాటి శివ, దుర్వేసుల హుస్సేన్, బోర మల్లేశ్వరరెడ్డి, బైపినేని కోటేశ్వరరావు, యు వెంకట్రావు, సుంకర నారాయణ, పీతల నాగు, డీ రాము, ముత్యాల రాంబాబు, నల్లం వాసు, గంగవరపు మురళి తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీటీసీ పురేంద్ర

విజయవాడ స్పోర్ట్స్/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యంగా ఉంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఉప రవాణా కమిషనర్(డీటీసీ) ఎం.పురేంద్ర అన్నారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాలు పురస్కరించుకుని ఉప రవాణా కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యాలయం పరిధిలోని భారీ వాహనాల డ్రైవర్లకు, స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లు 350 మందికి ఉచితంగా కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డీటీసీ మాట్లాడుతూ ఎంతో మంది వ్యక్తులను నిత్యం వారి గమ్య స్థానాలకు చేర్చే డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రధానంగా కంటి చూపు సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో ఆర్.ప్రవీణ్, ఆర్.జగదీశ్వరరాజు, రాష్ట్ర రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు, ఎంవీఐలు కె.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, ఏవో సి.హెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హరికథాగానప్రపూర్ణ విశ్వనాథ భాగవతార్

విజయవాడ కల్చరల్: హరికథా గానప్రపూర్ణ విశ్వనాథ భాగవతార్ అని కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి అన్నారు. అమ్ముల సార్మక సమితి, ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో అమ్ముల 107వ జయంతి, సార్మక పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంగీత సాహిత్యాలను మేళవింపుగా కథను వివరించడంలో అమ్ముల మొదటి స్థానంలో ఉంటారని తెలిపారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హరికథలను సంప్రదాయ కళగా గుర్తించి ప్రతి దేవాలయంలో హరికథా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సంగీత విద్వాంసుడు పోవూరి గౌరీనాథ్ మాట్లాడుతూ విశ్వనాథ భాగవతార్ విశేషాలను తెలియజేశారు. 2023 సంవత్సరానికి అమ్ముల విశ్వనాథ భాగవతార్ పురస్కారాన్ని ముదపాక సుందర భాగవతార్‌కు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పురస్కారం అందుకోవడం జీవితంలో మరచిపోలేని ఘట్టంగా భావించానన్నారు. సంప్రదాయ హరికథలను పరరక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విశ్వనాథ భాగవతార్ కుటుంబ సభ్యులు అమ్ముల ప్రసాద్, బీవీ దుర్గాభవాని పాల్గొన్నారు.

రేపు వాసవీమాత ఆత్మార్పణ పర్వదిన మహోత్సవం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న కె.రమేష్, వీవీకే నరసింహారావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ పర్వదిన మహోత్సవాన్ని పాతబస్తీలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు చెప్పారు. ఈ సందర్భంగా కల్యాణ మండపం ఆవరణలో కార్యక్రమ ఆహ్వాన పత్రికను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కొనిజేటి రమేష్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో వీవీకే నరసింహారావు మాట్లాడారు. వాసవి ఫౌండేషన్‌తో పాటు అవోపా కృష్ణా మహిళా విభాగ్, వాసవి పరివార్ రాష్ట్ర విభాగం, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు తుమ్మలపెంట శ్రీనివాసు, కేవీఎల్ గణేష్, అరవేటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

25న మెగా లోన్‌మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన ఈ నెల 25వ తేదీ బుధవారం వేదిక కల్యాణ మండపంలో మెగా లోన్‌మేళా నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో అన్ని ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు పాల్గొని అన్ని రకాల రుణాలు మంజూరు చేస్తాయని పేర్కొన్నారు. వివిధ రకాల రుణాలకు రాయితీలు, ప్రభుత్వం నుంచి డాక్యుమెంటేషన్, మార్కెటింగ్ తదితర సహకారాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అందిస్తుందని తెలిపారు. అన్ని రకాల బ్యాంకుల సేవలు ఒక్కచోటే లభించే సదవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిలో పాల్గొనేందుకు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 63059 41717, 80747 30408లో సంప్రదించాలని సూచించారు.

24న వాహనాల బహిరంగ వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విజయవాడ వెస్ట్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 24వ తేదీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెస్ట్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలోని వెస్ట్‌స్టేషన్ పరిధిలో ఆ రోజు ఉదయం 9 గంటలకు మొత్తం 5 వాహనాలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. పాల్గొనేవారు టూవీలర్స్‌కు రూ. 5వేలు, త్రీ వీలర్స్‌కు రూ. 10వేల చొప్పున తిరిగే చెల్లించే ఈఎండీ అందజేయాలని తెలిపారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పూర్తి వివరాలకు 94409 02455,99595 10446 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అలరించిన స్వరనీరాజనం



విజయవాడ కల్చరల్: సీనియర్ గాయని బాలసరస్వతి సినీ రంగ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు బాలాజీకుమార్ అన్నారు. నగర గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద శనివారం కలసిపాడుదాం పేరుతో బాలసరస్వతికి స్వర నీరాజనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గాయని బాలసరస్వతి సినీ రంగ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నట్లు తెలిపారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు విజయలక్ష్మి, బాబు పాల్గొన్నారు. వడ్డాది సూర్యకామేశ్వరి, నరసింహాచార్యులు, శ్రీనివాసరావు, దుర్గ, రైల్వే శ్రీనివాస్ పలు చిత్రగీతాలను ఆలపించారు.

25లోపు ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయాలి

జిల్లా సైన్స్ అధికారి ఎం. హుస్సేన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇన్‌స్పైర్ మనాక్ 2021–22 జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్ జరుగుతాయని జిల్లా సైన్స్ అధికారి ఎం, హుస్సేన్ శనివారంఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ఎంపికైన 376 ప్రాజెక్టులను ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్స్ ప్రాజెక్టులు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టుల నుంచి 10శాతం అనగా 38 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి, వాటి నుంచి 4 ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కావచ్చని తెలిపారు. ప్రభుత్వ పారితోషికం విద్యార్థుల ఖాతాలో జమ కాని వారు కూడా తక్కువ ఖర్చుతో వర్కింగ్ మోడల్ చేసి విద్యార్థి వివరణతో తన వినూత్న ఆలోచనను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. గైడ్ టీచర్స్ గూగుల్ ప్లే స్టోర్‌లో ఇన్‌స్పైర్ మనాక్ కాంపిటేషన్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. ప్రాజెక్ట్ వీడియో (2 నిమిషాల వ్యవధి/30ఎంబీ లోపు), ఆడియో (రెండు నిమిషాలు వ్యవధి), ప్రాజెక్ట్ కు సంబంధించి గరిష్ఠంగా నాలుగు ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి 1000 పదాలకు మించకుండా ఇంగ్లిషులో వివరణ ఇవ్వాలని తెలిపారు. వివరాలకు 98486 32062, 94408 83861, 73863 11633, 98665 28299 నంబర్లలో సంప్రదించాలని సైన్స్ అధికారి హుస్సేన్ కోరారు.

నో ఎంట్రీ టైంలో వస్తున్న వాహనాల నిలిపివేత



డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ ఉమర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నో ఎంట్రీ సమయంలో నగరంలోకి వస్తున్న లారీలు, ట్యాంకర్లు, టిప్పర్లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శనివారం ఉదయం 8 గంటలకు కూడా ఆయా వాహనాలు విద్యాధరపురం వంగవీటి మోహన రంగా జంక్షన్ వద్ద భవానీపురం సీఐ ఎండీ ఉమర్, ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించారు. వాస్తవానికి రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జామున 6 గంటల వరకు మాత్రమే భారీ వాహనాలు నగరంలోకి వచ్చి సీవీఆర్ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే ఉదయం 8 గంటలైనా వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తుండటంతో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు జంక్షన్ వద్ద నిలిపివేసి రికార్డులను పరిశీలించడం, అన్నీ సరిగ్గా ఉన్నా సమయం దాటిన తర్వాత వస్తుండటంతో జరిమానాలు భారీగా విధించారు. మళ్లీ ఇలా నో ఎంట్రీ తర్వాత వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తెల్లవారుజాము కూడా వాహనాలను నడపటంతో నిద్ర మత్తులో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, దీంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఆర్ఎస్ఐ అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో విధులకు రండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



నగర పర్యటనలో సిబ్బందితో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో విధులకు హాజరుకావాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం సర్కిల్–3 పరిధిలోని నాలుగో డివిజన్ గురునానక్ కాలనీలోని పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హాజరు వివరాలను సచివాలయాల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. రోజూ చెత్త సేకరణకు, డ్రైయిన్లు శుభ్రపరచడానికి సిబ్బంది వస్తోందీ లేనిది స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని, చెత్త సేకరణకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే అందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాల్వలో మురుగు పారుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నలంద స్పార్కిల్ 2కే 23



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎస్ఐ నాగమణి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసేందుకు నలంద డిగ్రీ కళాశాలలో శనివారం స్పార్కిల్ 2కే23 మేనేజ్‌మెంట్ మీట్ నిర్వహించారు. నగరంలోని పలు కళాశాలలకు చెందిన మేనేజ్‌మెంట్ విద్యార్థినులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ చదువుతో పాటు, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. గెలుపు కంటే పోటీల్లో పాల్గొనడం ముఖ్యమన్నారు. మేనేజ్‌మెంట్ హెచ్ఓడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించటానికి వేదికగా ఉంటుందన్నారు. బీబీఏ ఎనలిటిక్స్ విద్యార్థులు, అధ్యాపకుల పర్యవేక్షణలో క్విజ్, పోస్టర్ మేకింగ్, స్పెల్‌బీ, హెచ్‌ఆర్ ఎనలిస్ట్, మార్కెట్ ఎనలిస్ట్, ఫైనాన్షియల్ ఎనలిస్ట్, డ్యాన్స్, స్పాట్ ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించామన్నారు. బహుమతీ ప్రదానంలో మాచవరం పీఎస్ ఎస్ఐ నాగమణి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.